ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

మంగళవారం 13 మే 2025

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

● నేడు పరీక్ష ● జిల్లాలో 6 కేంద్రాలు



పరీక్ష కేంద్రంలో హాల్ టిక్కెట్ నంబర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య

పెద్దపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్ 2025కు ఏర్పాటు పూర్తయినట్లు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం పరీక్ష నిర్వహిస్తున్నామని, జిల్లాలోని 2488 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లకు, జిల్లా కోఆర్డినేటర్‌లకు పరీక్ష నిర్వహణకు సంబంధించిన వివరాలను కో ఆర్డినేటర్ వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తామని, విద్యార్థులను గంట ముందు నుంచే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లు, పెన్సిల్, పెన్‌తోసహా పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు.

సింగరేణి వైద్య కళాశాలకు రూ.3కోట్ల కేటాయింపు



మంత్రి వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్ కళాశాల అభివృద్ధి పనులకు సోమవారం రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.3కోట్లు మంజూరు చేసినట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. సోమవారం సచివాలయంలో మంత్రిని కలిసి రామగుండం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, సింగరేణి మెడికల్ కళాశాల నుంచి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలుపుతూ రాజీవ్ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి, కళాశాలలో రెండు ముఖ ద్వారాలను నిర్మాణానికి రూ.3కోట్లు కేటాయించాలని కోరగా మంత్రి వెంకటరెడ్డి మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. పనులను త్వరగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వరిరెడ్డిని మంత్రి ఆదేశించినట్టు తెలిపారు.

మొదలైన తునికాకు సేకరణ

● అడవిబాట పడుతున్న పల్లె జనం
● 3 యూనిట్ల పరిధిలో 18 కళ్లాల్లో ఆకు సేకరణ
● 2800 స్టాండర్ బ్యాగుల లక్ష్యం..
● 50 ఆకుల కట్టకు రూ. 3 చెల్లింపు
● అడవి బిడ్డలకు అదనపు ఆదాయం



తునికాకులను కట్టలు కడుతున్న మహిళలు

ఆకు సేకరిస్తున్న కూలీలు

మంథని, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ గ్రామాల్లో తునికాకు జాతర షురూ అయింది. తునికాకు సేకరణ కోసం పల్లె జనమంతా అడవి బాట పడుతున్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు తునికాకు సేకరణ, కట్టలు కట్టడంలో జనం నిమగ్నమవుతున్నారు. 15 రోజుల పాటు అటవీ గ్రామాల ప్రజలకు తునికాకు సేకరణతో అదనపు ఆదాయం సమకూరనుంది. దీంతో పిల్లల చదువులకు, అప్పు తీర్చడం, శుభ కార్యాలకు... ఆర్థిక అండగా తునికాకు సేకరణతో సమకూరిన ఆదాయం నిలుస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు అదనపు ఆదాయ వనరుగా మారింది తునికాకు సీజన్. ఆకు సేకరణదారులకు వరప్రదాయినిగా మారనుంది. ప్రతీ తునికాకు సీజన్ మేలో 15 రోజుల పాటు జరిగే ఆకు సేకరణతో అటవీ గ్రామాల్లోని ప్రతీ కుటుంబం దాదాపు రూ.20 వేలకు పైగా ఆదాయాన్ని పొందుతాయి. తునికాకుతో వచ్చే ఆదాయంతో అటవీ గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి.

● ఉదయమే అటవీ బాట

నిరుపేదలు పండుగలా భావించే తునికాకు సేకరణ కోసం ప్రజలు అడవుల బాట పడుతున్నారు. అయితే భానుడి ప్రభావంతో ప్రజలు తొమ్మిది గంటల వరకే ఆకు సేకరణతో చేసి వెనుదిరుగుతున్నారు. గ్రామాల్లోని నిరు పేదలంతా తెల్లవారుజామున 4 గంటలకు అడవి బాట పట్టి ఉదయం 9గంటల వరకు వారి సమీపంలోని అడవుల్లో చెట్లు, పుట్ట తిరుగుతూ చెట్లు ఎక్కుతూ, దిగుతూ అడవి జంతువుల బారిన పడకుండా ఆకును సేకరిస్తుంటారు. సేకరించిన ఆకులను మూటల్లో కట్టుకొని ఎడ్లబండ్లు, నెత్తిన పెట్టుకొని ఇళ్లకు చేరుకుంటారు. కాసేపు భోజన విరామం తర్వాత గ్రామాల్లోని ప్రతీ ఇంటిలోని కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఒక చోట కూర్చొని ఆ రోజు సేకరించిన ఆకునంతా 50 ఆకుల చొప్పున కట్టలు కడుతారు. ఆకుల కట్టలను సాయంత్రం గ్రామ శివారులోని ఆకుల కళ్లాల వద్దకు తీసుకెళ్లి కళ్లెదారుకు అప్పగిస్తారు. తునికాకు సీజన్‌లో గ్రామాల్లోని ప్రతీ కుటుంబం రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు సంపాదించుకునే అవకాశముంది.

● 3 యూనిట్ల పరిధిలో 18 కళ్లాల్లో ఆకు సేకరణ..

పెద్దపల్లి జిల్లాలో మంథని, పెద్దపల్లి ఫారెస్టు రేంజి పరిధిలో మంథని-1, ఖమ్మంపల్లి, ముత్తారం-ఏ, ముత్తారం-బీ, రామగుండం, పెద్దపల్లి, కల్వచర్ల

(మిగతా 8వ పేజీలో)

నర్సుల సేవలు మరువలేనివి



కేక్ కట్ చేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): రోగులకు నర్సులు అందిస్తున్న సేవలు మరువలేనివని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలతోపాటు వారిని కంటికి రెప్పలా కాపాడుతున్నారని, వారు కోలుకునే వరకు నర్సులే బాధ్యత వహిస్తారన్నారు. ఉత్తమ వైద్య సేవలందించిన నర్సులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సౌందర్య, సరస్వతి, సుమలత, స్వర్ణలత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. సోమవారం పెద్దకల్వల, మూలసాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యానికి సంబంధించిన మద్దతు ధర, సన్న రకం ధాన్యానికి బోనస్ డబ్బులు రైతులకు సకాలంలో జమ అయ్యేలా చూడాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 438 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి 304 కోట్ల చెల్లింపులు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. వాహనాల కొరత, హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలో చేర్చేందుకు కృషి



జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘ ప్రతినిధులు

సుల్తానాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి ఏలో చేర్చేందుకు కృషి చేస్తానని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం పూసాల పెద్దమ్మ ఆలయంలో పూజల అనంతరం సంఘం భవనాన్ని సందర్శించారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తెలుగుదేశం, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మారుస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ముదిరాజ్‌లు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా, ఏ సంఘంలో ఉన్నా అవసరమైనప్పుడు అందరం ఏకతాటిపైకి రావాలన్నారు. జిల్లాల్లో పర్యటించి మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గుర్రాల మల్లేశం మాట్లాడుతూ పూసాలలో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని పూర్తి చేసేందుకు కార్పొరేషన్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం జ్ఞానేశ్వర్‌ను వివిధ సంఘాల ప్రతినిధులు సన్మానించారు. హైకోర్టు ప్రభుత్వ రిటైర్డ్ న్యాయవాది బి.ఎల్.పాండు, ఉస్మానియా యూనివర్శిటీ నాయకుడు జగన్ ముదిరాజ్, శ్రీనివాస్, సతీష్, రవి, కనకయ్య, పోషవేణి రవి, పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు
● పది నిమిషాల్లో డాక్యుమెంట్ అందజేత
● ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ 6

గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయం
బుద్ధ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు 7

ఆటో డ్రైవర్లకు పోలీసుల కౌన్సెలింగ్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
● రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ కోన్‌ల ఏర్పాటు

కళ్యాణ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్‌లో ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యం అనే ఆంధ్రజ్యోతి కథనానికి రామగుండం ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్ఐ హరి శేఖర్‌లు గోదావరిఖని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రహదారిపై ఆటోలు పార్కింగ్ చేయవద్దని, బస్సుల ఇన్ కమింగ్, ఔట్ గోయింగ్ వద్ద ఎవరైనా బస్సులకు అడ్డంగా ఆటోలు నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ ప్రకారం ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని, పోటా పోటీగా ఆటో లను తిప్పవద్దన్నారు. రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ కోన్‌లను ఏర్పాటు చేశారు. ఎవరైనా అర్ధరాత్రి వేళల్లో ప్రయాణి కుల నుంచి ఆటో చార్జీలు అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రతి ఒక్కరూ టాప్ నంబర్‌ను కలిగి ఉండాలని, లైసెన్స్‌లు లేకుండా ఆటోలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, రాత్రి వేళల్లో ఒక్కరే ఆటో నడపాలని సూచించారు.



బస్టాండ్ ఎదుట ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు

యువ వికాసం యూనిట్ల మంజూరులో

నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): అర్హులకు యువ వికాసం కింద స్వయం ఉపాధి యూనిట్ మంజూరు చేయాలని, నిబంధనలు పాటించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజీవ్ యువ వికాసంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన దరఖాస్తుదారులు గతంలో ఏదైనా ఎన్‌పిఏ, వారి క్రెడిట్ హిస్టరీ పరిశీలించి అర్హులైన జాబితా బ్యాంకర్ల ద్వారా సేకరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈనెల 14 వరకు ఎంపిడివోలు మండలాల వారీగా బ్యాంకులో ఆమోదించిన అర్హుల జాబితా వివరాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి సమర్పించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా డీఆర్‌డీవో అర్హుల జాబితా వివరాలను సంబంధిత ఎమ్మెల్యేలకు అప్ప గించాలని, జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదంతో తుది జాబితా తయారు చేస్తామన్నారు. దాని ప్రకారం లబ్ధిదారుని పేరు మీద బ్యాం కు ఖాతా ప్రారంభించాలని, జూన్ 1 లోపల యువ వికాసం యూనిట్ మంజూరు పత్రాలు జారీ చేయాలని, రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి యూనిట్ల గ్రౌండింగ్ పై శ్రద్ధ వహించాలని కలెక్టర్ అధికారు లకు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

పెద్దపల్లిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కంకటి మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు ఇప్పటి వరకు విద్యుత్ ప్రజావాణి లో 469 ఫిర్యాదులు రాగా, 451 పరిష్కరించామని తెలిపారు. విద్యుత్ బిల్లుల సమస్యలు, మీటర్ల సమస్యలు, విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, క్యాటగిరి మార్పు, పేరు మార్పు తదితర విద్యుత్ ఫిర్యాదులు పరిష్కరించడానికి దోహదపడుతుందని తెలిపారు. సమస్యలపై వినియోగదారులు ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోనె సంచులు ఇవ్వడంలో నిర్లక్ష్యం
● పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్
● సుమారు రూ.8 లక్షల గంజాయి స్వాధీనం

6

హన్మాన్ దీక్షాపరులకు అన్నప్రసాదం

● కోదండ రామాలయంలో దాతల విరాళాలతో
● రోజుకు 250పైగా మందికి బిక్ష
● పదేళ్లుగా కొనసాగుతున్న కార్యక్రమం





ఖని కోదండ రామాలయం ఆవరణలో హనుమాన్ మాలదీక్ష పరులకు అన్నప్రసాద వితరణ

కోల్‌సిటీటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కోదండ రామాలయంలో దాతల సహకారంతో హన్మాన్ దీక్షపరులకు అన్నప్రసాదం వితరణ చేపడుతున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు దాతలు ముందుకు వస్తూ సేవలందిస్తున్నారు. పదేళ్ళుగా కోదండ రామాలయం ఆవరణలో హనుమాన్ దీక్షాపరులకు 41 రోజుల పాటు బిక్ష కొనసాగుతున్నది. యేటా చిన్న హనుమాన్ జయంతి నుంచి ప్రారంభమై 41 రోజులకు వచ్చే పెద్ద హనుమాన్ జయంతి వరకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు. రెండేళ్ళుగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి చొరవతో ఆలయ అర్చకుల పర్యవేక్షణలో ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేది నుంచి ఈనెల 22వ తేది వరకు ఈ అన్నప్రసాద వితరణ కొనసాగనున్నది. రోజు సుమారు 250 మందికి పైగా హనుమాన్ స్వాములు ఈ అన్నప్రసాద వితరణలో బిక్ష స్వీకరిస్తున్నారు. స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వడంతోపాటు సేవలందిస్తున్నారు.

● హనుమాన్ దీక్షకు మక్కువ...

హనుమాన్ మాల దీక్షలకు యువత, పెద్దలు, పిల్లలు మక్కువ చూపుతున్నారు. యేటా హనుమాన్ దీక్షకు ఈ ప్రాంతంలో వేలాది మంది దీక్షలు తీసుకుంటున్నారు. మండలం, అర్ధమండలం, 11 రోజుల పాటు దీక్షలు స్వీకరిస్తున్నారు. ఈ దీక్షలతో చెడు వ్యవసనాలు దూరమై మార్పులు వస్తుంటాయని అర్చకులు, గురుస్వాములు చెబుతున్నారు.

దీక్షాపరులకు ఇబ్బంది లేకుండా..

ముద్దసాని శంకర్, ఆలయ ఈవో, కోదండరామాలయం



రెండేళ్ళుగా ఆలయం పర్యవేక్షణలో ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు చొరవ తీసుకొని దీక్షాపరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాతల సహకారంతో 41 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. స్వాముల సంఖ్యకు తగ్గట్టు బిక్ష కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నాం. దాతలు ఇచ్చిన విరాళం అన్నప్రసాద వితరణకు ఉపయోగిస్తున్నాం.

యజ్ఞంలా అన్నప్రసాద వితరణ



మధుసూధనాచార్యులు, ప్రధానఅర్చకులు, కోదండ రామాలయం

రెండేళ్ళుగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆలయం పర్యవేక్షణలో హనుమాన్ దీక్షపరులకు 41 రోజుల పాటు అన్నప్రసాదం నిర్వహిస్తున్నాం. అన్నప్రసాద వితరణను ఎలాంటి ఇబ్బంది లేకుండా దాతల సహకారంతో విజయవంతంగా కొనసాగుతున్నది.

పోలాండ్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి దుర్మరణం



మనోజ్‌గౌడ్(ఫైల్)

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలాండ్ దేశంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాల మండల కేంద్రానికి చెందిన పొన్నం మనోజ్‌గౌడ్(29) అనేయువకుడు మృతిచెందాడు. మనోజ్‌గౌడ్ నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకాల నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మనోజ్‌గౌడ్ రెండేళ్ల క్రితం ఉపాధి కోసం పోలాండ్ వెళ్లాడు. సోమవారం ఉదయం రహదారి పక్క నుంచి నడుచుకుంటూ పనికి వెళ్తుండగా వెనుకాల నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మనోజ్ అక్కడిక్కడే మృతిచెందాడు. మనోజ్ మృతితో కుటుంబసభ్యుల్లో విషాదం నెలకొంది.

వ్యాపార భాగస్వాముల వేధింపులతో ఒకరి బలవన్మరణం

కరీంనగర్ క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ, హైదరాబాద్‌లో భూముల కొనుగోలులో పెట్టుబడి పెట్టిన వ్యక్తికి తోటి భాగస్వాములు డబ్బులు చెల్లించకుండా వేధింపులకు గురి చేయడంతో ఆదివారం రాత్రి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా వెల్గటూర్‌మండలం కిషన్‌రావుపేటకు చెందిన మోకినపల్లి శ్రీనివాస్(38) తీగలగుట్టపల్లిలో నివాసం ఉంటూ ఆటో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. యాదగిరి, భూపతి పాపయ్య, రెడ్డి రాజు, నగునూరు గోపితో కలిసి మృతుడు శ్రీనివాస్ ఇసుకక్వారీలో, హైదరాబాద్‌లోని భూముల్లో పెట్టుబడి పెట్టాడు. శ్రీనివాస్ తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని చాలా కాలంగా భాగస్వాములను అడుగుతున్నప్పటికీ వారు డబ్బులు ఇవ్వకుండా ఆర్థికంగానూ, మానసికంగానూ వేధింపులకు గురి చేశారు. దీంతో ఆవేదనకు గురైన శ్రీనివాస్ ఆదివారం రాత్రి తీగలగుట్టపల్లిలోని అద్దె ఇంటిలో ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ భార్య అంజలి ఫిర్యాదుతో నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై దాడులు

● పలువురు యజమానులకు జరిమానా

మెట్‌పల్లిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై కమిషనర్ టి.మోహన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను వాడుతున్న వారికి1500 రూపాయల జరిమానావిధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ మాట్లాడుతూ జ్యూటుబ్యాగులు మాత్రమేవాడాలని సూచించారు. దుకాణదారులందరూ ట్రేడ్‌లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, మున్సిపల్ సిబ్బంది ముజీబ్, పున్నం నాయక్, ప్రశాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం పట్టాలెక్కేనా?

● అభివృద్ధికి దూరంగా నాంపల్లి గుట్ట
● రూ. 30 కోట్ల పనులు ప్రతిపాదనలకే పరిమితం



వేములవాడ కల్చరల్, మే 12: వేములవాడ మండలంలోని నాంపల్లి గుట్ట ప్రకృతి అందాలకు నిలయం. చుట్టూ పచ్చదనంతో ఎంతగానో ఆకర్షిస్తూ.. గుట్ట మధ్య ఐదు తలల సర్పాకారంలో గుట్టపై నిర్మించిన కాళీయమర్ధనం, తలపై శ్రీకృష్ణుడి నృత్యరూపం, చుట్టూ పచ్చని పంటపొలాలు, ఓ వైపు మూలవాగు అందాలు, మరో వైపు మానేరువాగు అందాలు, ఎదురుగా మధ్యమానేరు డ్యామ్ బ్యాక్ వాటర్ చూపరులను కట్టిపడేస్తాయి. ఆరువందల సంవత్సరాల క్రితమే నాంపల్లి గుట్టపైన మూడు నామాల రూపంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రతిమ కుడివైపున హనుమంతుడి ప్రతిమ వెలిసినట్లు, చోళుల కాలంలోనే స్వామి వారికి పూజలు జరిగినట్లు ఆధారాలు చెబుతున్నాయి. మహిమాన్వితంగా వెలుగొందుతున్న లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఉన్న నాంపల్లి గుట్ట పర్యాటకంగా అభివృద్ధి దూరంగా ఉన్నది. 2015వ సంవత్సరంలో అప్పటి సీఎం కేసీఆర్ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన సందర్భంగా నాంపల్లి గుట్టను సందర్శించారు. గుట్టను పరిశీలించి అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లోనే రూ. 28 నుంచి రూ. 30 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధ చేసి చిత్రాలను సైతం విడుదల చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాంపల్లి గుట్ట పర్యాటకాభివృద్ధికి నోచుకోలేదు.

● కట్టిపడేసే కాళీయమర్ధనం

నాంపల్లి గుట్టపైకి వెళ్లే మార్గంలో మధ్య భాగాన 2003 సంవత్సరంలో చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి కేంద్రసహాయ మంత్రిగా ఉన్నప్పుడు ఐదు తలల సర్పాకారంలో వున్న కాళీయమర్ధనాన్ని నిర్మించారు. సుమారు సంవత్సరం పాటు కాళీయ మర్ధనం నిర్మాణ పనులు చేపట్టారు. పాముపైన శ్రీకృష్ణుడు నృత్యం చేస్తున్నట్లు వెనుకభాగంలో పచ్చటి పంటపొలాలతో ఎంతో ఆకర్షణీయంగా చూపరులను కట్టిపడేస్తుంది. కాళీయమర్ధనం లోపలికి వెళ్లే మార్గంలో శ్రీకృష్ణుడి లీలకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాళీయమర్ధనం లోపల ఉగ్రనృసింహస్వామి విగ్రహంతో పాటు నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని నాగ దేవతకు పాలతో అభిషేకం నిర్వహిస్తారు.

● నిరాదరణకు గురువుతన్న గుహలు, శిలలు

నాంపల్లి గుట్టపైన రెండు ధర్మగుండాలు ఉన్నాయి. గుట్ట బండరాళ్లలో వున్న ధర్మగుండం సుమారు వెయ్యి యేళ్ల క్రితం శ్రీరాజరాజేంద్రుడు కట్టించినట్లు స్థానికులు చెబుతున్నారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టతో శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకునేవారు. నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజసిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతో పాటు పలు విగ్రహాలు ఉన్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురవుతున్నాయి. క్రీ.శ 10వ శతాబ్ధంలో నవనాథ సిద్ధులు (తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ధి పొందారని, ప్రతినిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహలో నుంచి భూగర్భ మార్గంలో వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని చేరుకుని పూజలు చేసేవారని నానుడి. అలాంటి గుహలు నిరాదరణకు గురవుతున్నాయి. అంతే కాకుండా నాంపల్లి గుట్ట చుట్టూ ఎన్నో విశిష్టతలు ఉన్నాయి అందులో 12వ శతాబ్ధం సంబంధించిన జైన మతానికి చెందిన పార్శ్వనాథుని ప్రతిమ బండరాయికి కనిపిస్తుంది. ఇలాంటి ప్రతిమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అంతే కాకుండా గుట్టకు నాలుగు వైపులా పెద్ద పెద్ద బండరాళ్లకు హనుమంతుని ప్రతిమలు కనిపిస్తాయి.



నాంపల్లి గుట్టపై రోప్ వే ఊహా చిత్రం

● ప్రచారానికే పరిమితమైన అభివృద్ధి

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి గుట్ట అభివృద్ధి జరుగుతుందని జోరుగా ప్రచారం జరిగింది నాంపల్లి గుట్ట సుమారుగా 52 అడుగుల ఎత్తుతో కొంతభాగం నిటారుగా ఉండ టంతో గుట్టపైన కొలువుదీరిన స్వామి వారిని వృద్ధులు, వికలాంగులు దర్శించుకునేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో నాంపల్లి గుట్టపైకి వెళ్లేందుకు వీలుగా రోప్‌వే నిర్మాణం చేపట్టాలని, నాంపల్లి గుట్టపైకి వెళ్లేందుకు ఒక్కటే ఘాట్ రోడ్డు ఉండటంతో ప్రొటెక్షన్ వాల్‌తో మరో ఘాట్ రోడ్డు నిర్మాణం, గుట్టపైన ఉన్న రెండు ధర్మగుండాలను ఆహ్లాదకరంగా సుందరీకరణకు, గుట్టపైకి వచ్చే భక్తులను ఆకట్టుకునేలా వసతిగృహాల నిర్మాణం, గుట్టపైన ఆహ్లాదకరమైన వాతావరణంలో ధ్యానమందిరం నిర్మాణం, ప్లానిటోరియం, గుట్ట చుట్టూ వున్న ప్రకృతి అందాలను భక్తులు వీక్షించేందుకు గుట్టపైన పనోరమా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు ఊహాచిత్రాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు అధికారులు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో ముందడుగు పడటంతో భక్తులు నాంపల్లి గుట్ట కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టిసారించాలని కోరుతున్నారు.

గోనె సంచులు ఇవ్వడంలో నిర్లక్ష్యం

● పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన

పెద్దపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ సంచులు ఇవ్వకపోవడంపై చొప్పరి కనుకయ్య అనే రైతు ఆదివారం సాయంత్రం పురుగుల మందుతో ఆత్మహత్యయత్నానికి పాల్పడేందుకు యత్నించాడు. కనుకయ్య 25రోజుల క్రితం కేంద్రంలో ధాన్యాన్ని ఆరబోశాడు. పలుమార్లు అడిగినా గన్నీ సంచులు ఇవ్వలేదు. పది రోజుల క్రితం కేంద్రంలో పోసిన ధాన్యానికి గన్నీ సంచులు ఇవ్వడంతో కనుకయ్య నిర్వాహకులను నిలదీశారు. కొనుగోలు కేంద్రంలో క్రమపద్ధతి పాటించడం లేదని, అందరిని సమానంగా చూస్తూ కొనుగోలు చేయాలని సూచించినా నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో ఓ వైపు వర్షాలు, మరోపక్క ఎండతీవ్రత, కేంద్రం నిర్వాహకుల వైఖరిని నిరసిస్తూ కనుకయ్య ఆవేదనకు గురై పురుగుల మందు తాగేందుకు సిద్ధపడగా అక్కడే ఉన్న రైతులు అడ్డుకున్నారు. ఇంత జరిగినా నిర్వాహకులు గన్నీ సంచులు ఇవ్వలేదని రైతు చొప్పరి కనుకయ్య పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు

● పది నిమిషాల్లో డాక్యుమెంట్ అందజేత
● ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్



డాక్యుమెంటు అందజేస్తున్న రిజిస్ట్రార్

పెద్దపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత కేటాయించిన తేదీలో కార్యాలయానికి వస్తే కేవలం పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తోపాటు మ్యూటేషన్ అందించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లారిజిస్ట్రార్ బీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌సేవలు పైలట్‌ప్రాజెక్టు కింద ఎంపికైంది. సోమవారం ఆన్‌లైన్‌సేవలు ప్రారంభించిన అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మొదటి విడుతలో పైలెట్ ప్రాజెక్టు కింద 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎంపికయ్యాయని అందులో జగిత్యాల, రామగుండం ఉన్నాయని, రెండోవిడుతలో పెద్దపల్లి ఉందన్నారు. జూన్‌2న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. గతంలో స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు సుమారు వారంరోజులు సమయం పట్టేదన్నారు. ప్రస్తుతం పదినిమిషాల్లో ఇస్తామన్నారు. ఈ విధానం ద్వారా రోజుకు 48రిజిస్ట్రేషన్లు చేయ వచ్చన్నారు. దీంతో కార్యాలయం చుట్టు తిరగాల్సిన అవసరం లేదని, అలాగే ఎక్కువ సమయం నిరీక్షించవల్సిన పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభించగానే ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గడ్డం ఈశ్వరమ్మకు డాక్యుమెంట్‌ను అందజేశారు. అశోక్, పారుపెల్లి వేణు తదితరులున్నారు.

రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం

వీణవంక, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో గౌడకులస్థులు రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం చేశారు. నీటిబిందెలను నెత్తినపెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడసంఘం మహిళలు ప్రతిఇంటి నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఊరేగింపుగా కదిలారు. గీతకార్మికులందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.



వల్భాపూర్‌లో బిందెలతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

చొప్పదండిలో హార్వెస్టర్ దగ్ధం

చొప్పదండి, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. హార్వెస్టర్‌కు మంటలు అంటుకోగా సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



తిరుపతి రావు(ఫైల్)

తిమ్మాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): చేతికి వచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా తట్టుకోలేని తండ్రి ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిరికొండ తిరుపతి రావు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతని కుమారుడు సిరికొండ నిఖిల్‌రావు(22) హైదరాబాద్‌లో ఉంటూ బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతూ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. అందులో డబ్బులు పోగొట్టుకొని మనస్తాపానికి గురై గత మార్చి10న గ్రామశివారులోని వారి వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతిరావు కుమారుడు లేని లోటు జీర్ణించుకోలేకపోయాడు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావివద్ద (కుమారుడు పడిన బావి) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తిరుపతిరావు తన భార్య శ్యామలకు ఫోన్‌చేసి తెలిపాడు. వెంటనే ఆమె స్థానికులకు తెలుపగా వారు తిరుపతిరావును కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తిరుపతిరావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైనచికిత్స కోసం హైదారాబాద్ తరలించారు. హైదారాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తిరుపతిరావు మృతిచెందాడు. రెండునెలల్లో కుమారుడు, తండ్రి మృతిచెంద డంతో తిరుపతిరావు భార్య శ్యామల ఒంటరైంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

అంతర్గాం, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని బుగ్గ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కమాన్‌పూర్, భూపాలపల్లి ఏరియాకు చెందిన సాయి ప్రదీప్, యశ్వంత్, శివ, కమల్‌లు ఒడిశా రాష్ట్రం నుంచి రెండు బైక్‌లపై 15కిలోలు సుమారు రూ.8లక్షల విలువ గల గంజాయిని తరలిస్తున్నారు. విశ్వసనీయవర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకటస్వామి బుగ్గగుట్ట వద్ద వల పన్ని పట్టుకున్నారు. నిందితుల వద్ద ఉన్న బ్యాగుల తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. గంజాయితో పట్టుబడిన నిందితులను గోదావరిఖని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐతోపాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ అక్కపాక రవీందర్, మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

జగిత్యాల అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ ఆంధ్రప్రదేశ్‌లోని కొండారెడ్డిపల్లెకు చెందిన మాచనూరు కొండయ్య(22) జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్‌ఎస్సై మల్లేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలునిర్వహిస్తున్న సమయంలో పట్టుబడగా, కేసునమోదుచేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. న్యాయమూర్తి కరుణాకర్ కొండయ్యకు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఐదుగురికి రెండేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన కేసులో సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన ఎర్ర మల్లేశం, ఎర్ర రాజవ్వ, ఎర్ర సుజాత, ఎడవల్లి మల్లవ్వ, జింక దేవవ్వలకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 6వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారని టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన అరుణ తన ఇంటి వద్ద లేనిది చూసి ఇంటి వెనుక ప్రహరీ గోడను ఎర్ర మల్లేశం, రాజవ్వ, సుజాత, మల్లవ్వ, దేవవ్వలు కలిసి కూలగొట్టారు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న పోచవ్వ వెళ్లి అరుణకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన ఐదుగురు వ్యక్తులు కలిసి తిట్టుకుంటూ గడ్డపారతో పొడిచి గాయపరిచేందుకు ప్రయత్నించారు. ఈ దాడిని చూసిన నర్మెట్ట రమేశ్, రగుడు లక్ష్మన్ వెళ్లి పోచవ్వ, అరుణలను కాపాడారు. అయినప్పటికీ మిమ్మల్ని ఎప్పటికైనా చంపుతామని ఐదుగురు వ్యక్తులు బెదిరించారని సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు అరుణ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ అధికారి శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ 11మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పిపి సందీప్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణిన్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 6వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడి



కొలనూర్‌లో నాటుసారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓదెల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో ఆదివారం రాత్రి నాటుసారా తయారీకేంద్రాలపై పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలు కొనసాగిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నాటుసారా తయారు చేసి విక్రయానికి పాల్పడుతున్న గండికోట కనుకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఏఎస్‌ఐ రత్నాకర్, పోలీస్ సిబ్బంది రాజు, రాజేందర్, అశోక్ పాల్గొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, మే 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. వెంకటయ్యపల్లి గ్రామ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మూడుట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం దాడిచేయగా డ్రైవర్‌బెజ్జంకి తిరుపతి పరారయ్యాడు. ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సోమవారం నగరంలోని ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకురావడం సమ్మెహక్కు, ఉద్యోగ, సామాజిక భద్రత కాలరాయడమేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీ కరణ విధానాలు అమలు చేస్తోందన్నారు. మే20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కేంద్రప్రభుత్వంపై తిరుగుబాటు మొదలు పెట్టాలన్నారు. లేబర్‌కోడ్స్ రద్దుకోసం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలని, రైతులను, కూలీలను కలుపుకొని పెద్దఎత్తున సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి మారెళ్ల శ్రీలత, నాయకులు పద్మ, లక్ష్మి, రజిత, పరిమిత, సత్యలక్ష్మి, ప్రియాంక, సరిత, లత పాల్గొన్నారు.

కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి



రాజన్న ఆలయ గోశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర ఎండల నేపథ్యంలో రాజన్న ఆలయ కోడెల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లాకలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. తిప్పాపూర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోవులకు అందిస్తున్న మేత, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, సౌకర్యాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వాటి సంఖ్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ కోడెలకు వేసిన జియో ట్యాగులను పరిశీలించారు. ప్రతి గోవుకు జియో ట్యాగింగ్‌తో కూడిన పరికరాన్ని పెట్టాల న్నారు. తద్వారా కోడెల పంపిణీ అనంతరం వాటియొక్క లోకేషన్ ట్రాకింగ్ చేయవచ్చన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున గోశాల షెడ్లలో నీటి తుంపర్ల యంత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. షెడ్లలో నిలువ చేసిన గడ్డిని తరలించి కోడెలకు మేతకు ఉపయోగించాలన్నారు. కోడెలకు సరిపడా పచ్చిగడ్డి అందుబాటులో ఉంచాలన్నారు.

ఎండాకాలం నేపథ్యంలో గోవుల సంరక్ష ణను మరింత బాధ్యతగా చూసుకోవాలని గోశాల సిబ్బందికి సూచించారు. కోడెలకు నిత్యం అందించే దాణా, మేత, తాగునీరు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కోడెల వైద్యం టీకాలు, ఇతర అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కోడెల వయసు ఆధారంగా వాటిని వివిధ షెడ్‌లలో పెట్టాలన్నారు. అనంతరం పశువైద్యాధి కారులు గోవులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఆలయ ఏఈవో శ్రీనివాస్, గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

24 నుంచి 'తానాకాన్' రాష్ట్ర సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తానాకాన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ శ్రీనివాస్

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల24,25 తేదీల్లో తానాకాన్ పేరిట రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీధర్, ఆర్గనైజింగ్ ఫైనాన్స్ సెక్రెటరీ డాక్టర్ బండారి అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25వ తేదీల్లో నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించనున్న సదస్సులో 24న సీఎంఈ(కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 25న చిన్న, మధ్యతరహా హస్పిటల్స్, నర్సింగ్‌హోమ్స్ ఎదుర్కొంటున్న సమస్యలైన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, హాస్పిటల్స్ పర్మిషన్(న్యూ, రినివల్స్), పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ట్రేడ్ లైసెన్స్ ఎస్‌టీపీ, ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లపై దాడులు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 మందికి పైగా వైద్యులు హాజరతారని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ మహేశ్, డాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయం



వడుకాపూర్ గ్రామశివారులో బుద్ధుడికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

జూలపల్లి/ఎలిగేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణనీయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అన్నారు. వడుకాపూర్ గ్రామపరిధిలోగల అతిప్రాచీన బౌద్ధస్తూపం వద్ద సోమవారం బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని జూలపల్లి, ఎలిగేడు మండలాల దళిత సంఘాల నాయకులు, బౌద్ధిస్టులు గౌతమ బుద్ధుడి జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణారావు బుద్ధుడివిగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మానవజాతికి సహనాన్ని, ప్రేమతత్వాన్ని, అహింసను, శాంతిని పంచిన బుద్ధుడి బోధనలు అందరికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పంచశీల జెండాను ఆవిష్కరించారు. బుద్ధ క్షేత్రానికి రావడానికి రహదారి సరిగా లేదని, తారురోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ దేవా శ్రీనివాస్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేహదానం అవయవదాన పత్రాన్ని అందించారు. ఎస్ఐ సనత్‌కుమార్, విశ్రాంత సబ్‌ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య కాంబ్లే, దేవ శ్రీనివాస్, పర్శరాములుగౌడ్, మొగురం రమేష్, పాటకుల భూమయ్య, పలువురు నాయకులు బౌద్ధిస్టులు, పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఎంఏ (ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, ఎకనామిక్స్ సోషియాలజీ), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ (వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, గణాంకాలు, మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్, కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్, ఎంకామ్ (జనరల్, ఎఫ్ఏ, సీఏపీ, ఇన్సూరెన్స్), ఎంబీఏ. 1,3వసెమిస్టర్ జనవరి/ఫిబ్రవరి 2025పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారిడాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ww.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండో, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభమవుతాయని, వెబ్ సైట్‌లో హాల్‌టికెట్స్ పొందుపరిచామని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలు డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు జారీ చేయాలని సూచించారు. పరీక్షలు వాయిదా అంటూ సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని తెలిపారు.



కాళేశ్వరం గోదావరి వద్ద ఏర్పాటు చేసిన ఆకృతి

చల్లగ చూడు సరస్వతీ మాత

15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు

- కాళేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు...
- రేపు రాత్రి 10-35 గంటలకు పుష్కర ముహూర్తం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత దేశం ఎన్నో పుణ్య నదులున్నాయి. గురువు ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఆయా నదికి పుష్కరాలు వస్తాయి. పుష్కరం అంటే జలమని పేరు. మామూలు నదీ స్నానం కంటే పుష్కర స్నానం అనేక రెట్ల పుణ్య ఫలాన్ని, సకల శుభాలను, మోక్షాన్ని ఇస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. సరస్వతీ నది ప్రస్తావన ఋగ్వేదంలో ఉంది. ఈ నది ఎవరికీ కనపడదు. హిమాలయాలలోని శివాలిక్ పర్వత పంక్తుల్లోని ప్లక్షప్రస్రవణగిరిపై పుట్టింది. సరస్వతీ నదీ ప్రస్తావన పద్మ, బ్రహ్మవైవర్త పురాణాల్లోనూ ఉంది. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు రానున్న సందర్భంలో 'ఆంధ్రజ్యోతి' కథనం...

ఇదే పుష్కర సమయ ముహూర్తం...

ఈ నెల 14వ తేదీ రాత్రి 10-35 గంటలకు బృహస్పతి మిథున రాశిలో ప్రవేశించడంతో సరస్వతీ నది పుష్కరాలు ప్రారంభం కానున్నట్లు కాళేశ్వర ఆలయం అర్చకులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

● సరస్వతీ నది ఎక్కడెక్కడ ఉంది?

తొలుత భూమిపై ఉత్తరాఖండ్, చమేలీ జిల్లా బదరీనాథ్ సమీపంలో మానా గ్రామంలో మాత్రమే సరస్వతీ నది కనిపిస్తోంది. ఇదే మొదటి నది. ఈ నదిని అక్కడ ప్రత్యక్షంగా చూడవచ్చు. పాండవులు స్వర్గారోహణం చేసే ముందు మానా గ్రామానికి వచ్చినప్పుడు ఈ నదిని దాటాల్సి వచ్చింది. అప్పుడు భీముడు రెండు కొండల మీద మరో కొండ నిలిపి వంతెనలా ఏర్పాటు చేశాడు. అందుకే దాన్ని భీమ్‌పూర్, భీమ్ వారధి అంటారు. ఇక రెండోది పంచ సరోవరాల్లో ఒకటైన పుష్కర్ సరోవరంలో కనిపిస్తుంది. ఇది రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో ఆరావళి కొండల మధ్యఉంది. అజ్మీర్‌కు 14 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మదేవుడి ఆలయం కూడా ఉంది. పద్మపురాణం ప్రకారం వజ్రనాభుడు అనే రాక్షసున్ని బ్రహ్మ తన చేతిలోని తామర పువ్వు విసిరి సంహరిస్తాడు. ఆ పువ్వులోని 3 రేకులు భూమిపై పడి జేష్ఠ, మధ్య, కనిష్ట పుష్కర సరస్సులుగా మారి సరస్వతీ నది ద్వారానే ఏర్పడినాయని తెలుస్తోంది. మూడోది గంగా, యమునా నదులతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహించే ప్రయాగరాజ్ క్షేత్రం. ప్రయాగకు అమృత తీర్థమని, భాస్కర తీర్థమనే పేర్లు వచ్చాయి. నాలుగోది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్ధాపూర్‌లో ఉన్నది. ఐదోది తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా, కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితలతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల పుష్కరిణిలో కూడా సరస్వతి అంతర్లీనంగా ఉందని చెబుతారు. ఇది ఆరోది. ఈ ప్రదేశాల్లో పుష్కర రోజుల్లో స్నానం చేయవచ్చు.

● పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు...



కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లు

కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దేవాదాయశాఖ అధికారులతో కలసి ప్రత్యేక ప్రణాళికను రూపొందిచారు. ప్రభుత్వం 35 కోట్లు విడుదల చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నట్లు, 12 రోజుల పాటు నదీ హారతి ఉంటుందని మంత్రులు తెలిపారు. పుష్కరాలకు ప్రతీ రోజూ లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పుష్కర ఘాట్‌లు, మంచినీటికి, వసతికి, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు చెప్పారు.

● హెలీకాప్టర్‌తో జాయ్‌రైడ్

పుష్కరాల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం హెలీకాప్టర్ ద్వారా పుష్కరాలను వీక్షించేందుకు జాయ్ రైడ్‌ను అందుబాటులోకి తీసుకరానున్నారు. ఒక్కరికి 4,500 టికెట్ చొప్పున తీసుకొని 6 నుంచి 7 నిముషాల పాటు హెలీకాప్టర్‌లో పుష్కరాలను, కాళేశ్వర అడవుల అందాలను వీక్షించవచ్చు. టికెట్ల బుకింగ్ కోసం టోల్‌ఫ్రీ నంబరును త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిసింది.

● పుష్కర స్నానం ఎలా చేయాలి?

స్నానానికి ముందు సరస్వతీ నదిని అర్చించి, స్నానం చేయాలి. దంపతులు కొంగులు ముడి వేసుకొని మూడు సార్లు మునిగి సరిగంగ స్నానం చేయాలి. నదీ స్నానం ఎక్కడ, ఎప్పుడు చేసినా ముందు పిడికెడు మట్టిని ఒడ్డు నుంచి తీసుకొని కృత్య అనే శక్తిని స్మరించి నదిలో వేయాలి. ఆ పై సంకల్పం చెప్పుకొని స్నానం చేయాలి. 12 రోజులు 12 రకాల దానాలు ఆచరించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

కలెక్టరేట్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ధర్నా

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): దళితబంధు నిధులపై విధించిన ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి గ్రౌండింగ్ చేయాలని కోరుతూ దళితబంధు లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హుజూరా బాద్ నియోజకవర్గానికి చెందిన 60మందికిపైగా రెండోవిడత లబ్ధిదారులకు సంబంధించిన ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్నారు. గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దళితుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఖాతాలో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

అంతకుముందు ఎస్సీ కార్పొరేషన్ సీఎండీ జనవరి 28న నిధులు విడుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల జిరాక్స్‌లను చూపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండవ విడత దళితబంధు లబ్ధిదారులు

పౌర రక్షణ వలంటీర్ల నమోదుకు ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మై భారత్ యువతను పౌరరక్షణ వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని ఆహ్వానిస్తున్నట్లు మైభారత్ నెహ్రూ యువ కేంద్ర, జిల్లాయువజన అధికారి వెంకట రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, మై భారత్ దేశవ్యాప్తంగా యువతను భారత్‌పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. దేశానికి సేవ చేయాలనుకునే ఇందులో చేరడానికి ఆహ్వానం పలుకుతున్న పేర్కొన్నారు. వివరాలకు https://mybharat.gov.in, మై భారత్ నెహ్రూ యువ కేంద్రం, కరీంనగర్ జిల్లా, నంబర్లలో 9177329258, 0878-2243604 సంప్రదించాలని సూచించారు.

అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ



కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరులచుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణను సోమవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో 28వ సారి నిర్వహించిన ఈ గిరిప్రదిక్షణ నూతనంగా ఏర్పాటు చేసిన మార్గంలో సుమారు ఆరు కి.మీల మేర సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

19 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షల ప్రణాళిక విడుదల చేశారు. ఈ నెల 19నుంచి 30వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 2019 బ్యాచ్ బ్యాక్లాగ్ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించినట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, ఆయా కళాశాలల్లోగానీ సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ పార్సిల్స్ వేలం

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్ లాజిస్టిక్స్ కౌంటర్‌లో 40 రోజుల పైబడిన పార్శిళ్లను వేలం వేయన్నుట్లు కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 11 గంటలకు కరీంనగర్ బస్టాండ్ కౌంటర్‌లో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

జేఎన్టీయూలో ప్రశాంతంగా ఈసెట్



పరీక్ష హాల్‌లోకి వెళుతున్న అభ్యర్థులు

రామగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈసెట్ పరీక్షలు సోమవారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసాయి. ఆన్‌లైన్ పద్ధతిలో ఉదయం జరిగిన పరీక్షలో 100 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మామిడికాయ పచ్చడి సందడి





మామిడికాయలను ముక్కలుగా కొడుతున్న మహిళ

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మామిడికాయ పచ్చడి సందడి నెలకొంది. పచ్చడికి అనువైన మాసాలు ఏప్రిల్, మే కాగా మే నెలలో తయారీకి ప్రాధాన్యమిస్తారు. కాయల నాణ్యత, పచ్చడి పెట్టే విధానాన్ని బట్టి రెండు సంవత్సరాల వరకూ నిలువ ఉంటుంది. అందుకే మామిడి పచ్చడిని ఏడాది గ్రాసంగా అభివర్ణిస్తారు. వేడి అన్నంలో పచ్చడి, నూనె లేదా నెయ్యి కలుపుకొని తింటే స్వర్గం కనిపిస్తోందని పచ్చడి ప్రియులు పేర్కొంటారు. గాలి వానలకు కాయలు రాలక ముందే కాయలు, వస్తువులు కొనుగోలు చేస్తూ పచ్చడి తయారీలో నిమగ్నమవుతున్నారు.



మామిడి కాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

● చుక్కలను చూపుతున్న ధరలు

● మామిడికాయల ధరలు...

మార్కెట్‌లో కాయలు రైతులు రాసులుగా పోశారు. పుల్లటి కాయకు గిరాకీ ఉండగా ఒక్కో కాయ సైజును బట్టి 6 నుంచి 15 రూపాయల వరకు అమ్ముతున్నారు. కాయ ఎంపికలో జాగ్రత్తపడక పోతే తొక్కు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. గ్రామాల నుంచి మార్కెట్‌కు వచ్చిన పలువురు కాయలను కొడుతూ ఉపాధి పొందుతున్నారు. నీళ్లలో వేసి తుడిచి కొట్టేందుకు కాయకు ఐదు నుంచి ఎనిమిది రూపాయల వరకు తీసుకుంటున్నారు.

● ముడి వస్తువుల ధరలు

పచ్చడికి అవసరమైన వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ 160, పల్లి నూనె ప్యాకెట్ 150, ఆవాలు, మెంతులు కిలోకి100, జీలకర్ర కిలో 300, శనగలు కిలో 80, ఉప్పు కిలో 20, కారం 250, ఇంగువ 50 రూపాయల వరకు పలుకుతున్నాయి.

● పచ్చడి తయారీ ఇలా...

బాణలో నూనెపోసి ఆవాలు, జీలకర్ర, మెంతులు (అలవాట్లను బట్టి అల్లం వెల్లుల్లి)వేసి పోపు పెట్టాలి. తగినంతగా కారం, ఉప్పు వేసి చల్లార్చుకోవాలి. తర్వాత మామిడి ముక్కలను కలపాలి. పోణిలో ఇంగువను వాడవచ్చు. పల్లీలు, జీడిని కూడా వేస్తారు. ఉప్పు ఆవకాయ పెట్టేవారు ఆవపొడి, పసుపు, ఉప్పు వేసి కలిపి పెట్టి ఒక రోజు తర్వాత పోపు పెట్టాలి. ముక్కలతో పాటు పోపు పెట్టిన కారాన్ని కల్పి జాడీలలోకి ఎత్తుకుంటే రెండు రోజుల తర్వాత ఊరుతుంది. పచ్చడి ఎంత ఊరితే అంత రుచి వస్తోంది.



బీజేపీ మండల అధ్యక్షుల నియామకం


సతీష్‌కుమార్


పవన్‌కుమార్


శశికుమార్

గోదావరిఖని, మే 12 (ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో మూడు మండలాలకు అధ్యక్షులను భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి సోమవారం ప్రకటించారు. నియోజకవర్గంలోని ఎన్‌టీపీసీ మండల అధ్యక్షులుగా మిట్టపల్లి సతీష్‌కుమార్, తిలక్‌నగర్ మండల అధ్యక్షులుగా పవన్‌కుమార్, యైటింక్లయిన్‌కాలనీ మండల అధ్యక్షులుగా ఆకుల శశికుమార్‌లను నియమించారు. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు కోమళ్ళ మహేష్, గాండ్ల ధర్మపురి, మూకిరి రాజు పాల్గొన్నారు.

కాలనీ శాఖ బీజేపీ అధ్యక్షుడిగా శశికుమార్

గోదావరిఖని, మే 12 (ఆంధ్రజ్యోతి): యైటింక్లయిన్ కాలనీ బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడిగా ఆకుల శశికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి నియామకపత్రాన్ని శశికుమార్‌కు అందజేశారు. బీజేపీ సిద్ధాంతాలను, కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాగా తన నియామకానికి సహకరించిన నాయకులకు శశికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

మురళినాయక్‌కు జోహార్లు


మురళినాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులు

ఎలిగేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్ట గ్రామంలోని అంబేడ్కర్‌చౌక్‌లో దేశ రక్షణలో అమరుడైన ఆర్మీ జవాన్ మురళినాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ బాలసాని పరశురాంగౌడ్, అట్టెపల్లి కనకయ్య స్థానిక యువకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

ఎలిగేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాలకు చెందిన రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట(జీలుగ)విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి తెలిపారు. ఒక్కో బస్తా 30కిలోలు, సబ్సిడీ మినహా రైతు చెల్లించవలసిన బస్తా ధర 2137.50 రూపాయలు. రెండు ఎకరాలకు బస్తా సరిపోతుందని, రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వెళ్లి సహకార సంఘాలు, ఆగ్రోస్‌లో విత్తనాలు పొందాలని పేర్కొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు


అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

ముత్తారం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముత్తారం గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి వచ్చి రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగులో యూరియా మోతాదుని తగ్గించి, సాగు ఖర్చును తగ్గించుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీధర్‌సిద్ధి, రాజేంద్రప్రసాద్, విష్ణువర్ధన్, అల్లరి యాదగిరిరావు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్య

ధర్మారం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందిస్తున్నామని ధర్మారం మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కొలుముల దామోదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన-అభినందన సభలో ఆయన మాట్లాడారు. 2025 పదవ తరగతి ఫలితాల్లో మండల పరిధిలోని పాఠశాలల్లో 98శాతం ఉత్తీర్ణత సాధించామని అన్నారు. జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు మాలతీలత, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, విజయలక్ష్మి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గీతా యజ్ఞం

రామగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ మండలంలోని కల్వచర్ల గ్రామంలో గీత సంపూర్ణ హవనయజ్ఞం సోమవారం ఘనంగా నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా గణముక్కుల రాజమౌళిచారి దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పెద్దసంఖ్యలో దంపతులు హాజరై హోమ కృతువును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కళ్యాణ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పెద్దపల్లి సీఐ ప్రవీణ్ అన్నారు. గోదావరిఖని జీఎం కాలనీ గ్రౌండ్‌లో కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సోమవారం ఆయన పరిశీలించారు. కిరణ్, కోచ్ సుదేష్ పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

మంథని, మే 12 (ఆంధ్రజ్యోతి): తమ చిన్ననాటి మిత్రుడి కూతురి వివాహానికి స్నేహితులంతా కలిసి రూ. 58 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. స్థానికంగా ఉంటున్న రాయి ప్రకాష్ కూతురు వివాహానికి అతని స్నేహితులంతా కలిసి ఆర్థిక సహాయం చేసి తమవంతుగా చేయూతనిచ్చారు. దుమ్మని లక్ష్మణ్, నీలం రమేష్, కొంతం అనిల్, పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలి

పెద్దపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): తమ జీవితాలను త్యాగం చేస్తేనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్షకు సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. నూనె రాజేశం, దబ్బెట చంద్రకళ, బత్తుల శంకర్, కాల్వల తిరుపతి, దామ సదయ్య, నూనె మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ

సుల్తానాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ గాంధీనగర్‌కు చెందిన రవి అనే ట్రాలీ ఆటో యజమాని ఆటోను ఆదివారం రాత్రి ఇంటి ఎదుట పార్కు చేశాడు. సోమవారం ఉదయం లేచి చూసే సరికి ఆటో కనిపించ లేదు. బాధితుడు రవి సుల్తానాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని దొంగ ఆటోను ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పకడ్బందీ చర్యలు

పెద్దపల్లిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త, పలు అంశాలపై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, తడి, పొడి చెత్త వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. చెత్త అధికంగా ఉండే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, మురికి కాలువ సమస్యలపై వార్డు అధికారులకు అవగాహన ఉండాలన్నారు. వార్డు అధికారులు ఉదయం ఫీల్డ్‌లో అందుబాటులో ఉండి చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ తరలింపు అంశాలను పరిశీలించాలని సూచించారు. పట్టణ పరిధిలో ఇక నుంచి మంగళవారం, శుక్రవారం పొడి చెత్త సేకరణ, మిగిలిన రోజులలో తడి చెత్త సేకరిస్తామని, ప్రజలు దీనిని గమనించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో సహకరించే ప్రజలకు అవార్డులు అందిస్తామన్నారు. మున్సిపాలిటీ సహకరిస్తున్న ఇండ్లకు స్వచ్ఛ హౌస్ స్టిక్కరింగ్ అంటించాలని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ హౌస్‌పై వార్డు అధికారుల పని తీరు అందుబాటులో ఉంటుందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయవద్దని బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి మున్సిపాలిటీకి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణం శాంతినగర్‌కు చెందిన రాజమణి చందపల్లి శివారులో గల సర్వే నెంబర్ 645 లో 100 చదరపు గజాల భూమి ప్రభుత్వం తమకు కేటాయించిందని, అక్కడ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని దరఖాస్తు చేసుకోగా ఎంపీడీవో కు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): కాకర్లపల్లి గ్రామానికి చెందిన దళితులకు రెడ్డి చెరువు శివారులోని 16 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ఇవ్వాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గతంలో కాకర్లపల్లి దళితులకు భూములు ఇచ్చి సీలింగ్ రికార్డులో నమోదు చేశారని, ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. అర్హులైన దళితులకు భూములు ఇచ్చి పట్టాలు అందజేయాలని కోరారు. బూడిదగణేష్, అశోక్, శ్రావణ్, శంకర్, రవీందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐగా పదోన్నతి

జ్యోతినగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్‌లోని ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కొంతం కృష్ణారెడ్డికి ఏఎస్‌ఐగా పదోన్నతి లభించింది. సోమవారం రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా పదోన్నతి పొందిన కృష్ణారెడ్డికి స్టార్ తొడిగారు. ప్రమోషన్ పొందిన కృష్ణారెడ్డికి సహచర పోలీసులు అభినందనలు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కామ్సాని శ్రీనివాస్ ఏఎస్‌ఐగా పదోన్నతి పొందాడు. 1990లో కానిస్టేబుల్‌గా ఎల్‌ఎండి పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగంలో చేరి 2016లో గంభీరావుపేటలో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. శ్రీనివాస్‌కు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ స్టార్‌ను అందుకున్నాడు. ఏఎస్‌ఐగా పదోన్నతి పొందడంతో ఎస్సై వెంకటేష్‌తో పాటు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


పదోన్నతి పొందిన వారికి స్టార్ తొడుగుతున్న సీపీ

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెద్దపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. సోమవారం హనుమంతునిపేట, రాంపల్లి, దామనపల్లి, వెంకట్రావుపల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లితో పాటు పలు గ్రామాల్లో ఈనెల 20న చేపడుతున్న సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముత్యంరావు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, విధి నిర్వహణలో గాయపడిన, చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. 55సంవత్సరాల నిండిన హమాలీ కార్మికునికి నెలకు రూ.9వేల పెన్షన్ ఇవ్వాలని, హమాలీ కూలి రేట్లు రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించి, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాల్లో పాల్గొనాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఉన్న హక్కుల్ని ఊడగొట్టి, పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే విధానాలను అనుసరిస్తుందన్నారు. సమ్మయ్య, గంగయ్య, నరసయ్య, శంకర్, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెలో హమాలీ కార్మికులు పాల్గొనాలని వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, మంగపేట, పెగడపల్లి, మడిపల్లి, అంకంపల్లి గ్రామాల్లో హమాలీలతో కలిసి ఆశాఖ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముత్యంరావు పోస్టర్లు ఆవిష్కరించారు. రమేష్, సమ్మయ్య, మధునయ్య, రవి, పాల్గొన్నారు.

సాక్షి రూపానంద స్వామికి ఘనస్వాగతం

జూలపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే కార్యక్రమానికి సోమవారం చిన్మయ మిషన్ నుంచి సాక్షి రూపానంద స్వామీజీ వచ్చారు. ఆయనకు ఆలయ పూజారి నవీన్ పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం రూపానంద స్వామీజీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు నల్లమనోహర్‌రెడ్డి, కొప్పుల మహేష్, పొట్యాల మల్లేశం, వంగపెల్లి వెంకటరమణ, పిల్లి భూమయ్య, బండి స్వామి, పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలతో విజ్ఞానం

ధర్మారం, మే 12 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడి బోధనలు చదివిన వారు విజ్ఞాన వంతులయ్యారని బుద్ధ ఉపాసకులు బొల్లి స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గౌతమి బుద్ధ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బుద్ధుని బోధనలు ప్రపంచ మానవాళికి అహింస మార్గాన్ని నేర్పించాయన్నారు. బహుజన హితాయ-బహుజన సుఖాయ అని అన్ని వర్గాల ప్రజలకు మంచిని, సంతోషాన్ని బుద్ధుడు పంచిపెట్టారని గుర్తు చేశారు. ఏఎంసీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, గేనె సత్యనారాయణ, కొమురయ్య, భూమయ్య, సుందరగిరి పోశెట్టి, బైకెని మల్లమ్మ, పాలకుర్తి బుచ్చయ్య తదితరలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కళ్యాణ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మూడు మండలాల అధ్యక్షులను నియమించారు. ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిల్లో బీజేపీ కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికల్లో స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేయాలని, అధ్యక్షులు మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారని చెప్పారు. రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు కోమళ్ల మహేష్, ధర్మపురి, మూకిరి రాజు, తోట కుమారస్వామి, మచ్చ విశ్వాస్, భూమయ్య, అపర్ణ, లింగం, కుమార్ పాల్గొన్నారు.

నర్సుల సేవలు మరువలేనివి


నర్సును సన్మానిస్తున్న ఈడీ, మహిళా సమిత సభ్యులు

జ్యోతినగర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నర్సుల సేవలు మరువలేనివని ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత అన్నారు. సోమవారం ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈడీ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగి చేరి నప్పటి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు నర్సులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. నర్సింగ్ వ్యవస్థ సృష్టికర్త ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్ర పటానికి నివాళులర్పించారు. నర్సులను ఈడీ, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖి సామంత సన్మానించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): నర్సుల సేవలు అభినందనీయమని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. వైద్యరంగంలో కీలకమైన నర్సుల వృత్తికి గౌరవాన్ని, హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్ నైటింగేల్ పుట్టిన రోజున నర్సుల దినోత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. డిస్పెన్సరీలో విశిష్ట సేవలు అందించిన స్టాఫ్ నర్సు జ్యోతిరెడ్డిని జీఎం సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. డిస్పెన్సరీ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, పర్సనల్‌మేనేజర్ సుదర్శనం, మెడికల్ అధికారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీకి ఐఐఐఈ ఫర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ పురస్కారం

గోదావరిఖని, మే 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఉన్నతికి కృషి చేస్తున్న సీఎండీ ఎన్ బలరాంకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (ఐఐఐఈ) ప్రతిష్ఠాత్మక ఫర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని ప్రకటించింది. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఆదివారం జరిగిన 25వ జాతీయ స్థాయి ముఖ్య కార్యనిర్వహణ అధికారుల సమావేశంలో అవార్డును ప్రదానం చేశారు. సంస్థ సీఎండీ బలరాం తరఫున అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, ఐఐఐఈ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు భాస్కర్ పురస్కారాన్ని స్వీకరించారు. షిల్లాంగ్‌లో ప్రదానం చేసిన అవార్డును సోమవారం సింగరేణి భవన్‌లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీ ఎం సుభాని, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ భాస్కర్ సంస్థ సీఎండీ బలరాంకు అందజేశారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో సింగరేణి బహుముఖ విస్తరణ కోసం వినూత్న ప్రాజెక్టులు ప్రారంభించారని, కార్మికుల సంక్షేమానికి కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా, ఒడిశాలో నైనీ ప్రాజెక్టు ప్రారంభానికి చొరవ, సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలోనూ సింగరేణిని ముందుకు తీసుకెళ్తుండటంపై అవార్డును ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు. సీఎండీ బలరామ్ మాట్లాడుతూ సంస్థకు ఫర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ప్రతి ఉద్యోగి శ్రమకు లభించిన గుర్తింపు అని పేర్కొన్నారు. కోలిండియా, ఎన్ఎండీసీ, మజ్గావ్ డాక్ యార్డు, భెల్, టీపీసీఎల్, ఎంసీఎల్, హెచ్ఏఎల్ తదితర సంస్థల నుంచి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


ఎక్సలెన్స్ అవార్డుతో సీఎండీ బలరాం

సమ్మెను జయప్రదం చేయండి


ఓసీపీ-5 గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కొరిమి రాజ్‌కుమార్

గోదావరిఖని, మే 12(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కొత్త గనులు, కార్మిక చట్టాల కొనసాగింపు, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు తదితర డిమాండ్లపై ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సింగరేణిలో జయప్రదం చేయాలని సింగరేణి జేఏసీ సంఘాల నాయకులు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు గడ్డం క్రిష్ణ, సీఐటీయూ నాయకులు నాగరాజు గోపాల్, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు కే విశ్వనాథ్‌లు పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే ఓసీపీ-5, జీడీకే 2ఇంక్లైన్‌లలో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ కార్మిక చట్టాల మార్పుతో హక్కులు హరించిపోతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను కోల్ ఇండియాకు, సింగరేణికి కేటాయించకుండా వేలం పాట ద్వారా ప్రైవేటుకు ఇస్తోందని విమర్శించారు. సింగరేణికి వేలం పాట లేకుండా కొత్త గనులు వస్తేనే మనుగడ కొనసాగుతుందని, లేకుంటే యువ కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సింగరేణికి చెందిన సమస్యలను కూడా సమ్మె నోటీసులో పేర్కొంటూ యాజమాన్యానికి నోటీసు ఇచ్చామని తెలిపారు. మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, మాదన మహేష్, రంగు శ్రీను, గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, పాల్గొన్నారు. సమావేశానికి ముందు జీడీకే ఓసీపీ-5లో పహల్గాంలో ఉగ్రవాదుల దాడుల మృతి చెందిన వారికి, భారత్ పాక్ యుద్ధంలో మరణించిన సైనికులకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం

గోదావరిఖని, మే 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన సొంతింటి కల త్వరలోనే నెరవేరబోతుందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన కోర్ కమిటీ మీటింగ్‌లో చర్చించామన్నారు. కార్మికులకు సొంతింటి కల నెరవేర్చాలని, సంస్థలో పని చేస్తున్న బీటెక్, ఎంటెక్, ఎంబీఏ కార్మికులతో ఐటీ సంస్థ ఏర్పాటు చేయాలని మంత్రులు పొంగులేటి, శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. 3వేలకుపైగా విజిలెన్స్ కేసులు ఉన్నాయని, వీటిని త్వరగా పరిష్కరించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాలు ఇవ్వాలని కోరగా త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్టు చెప్పారు. వీటితో పాటు 20డిమాండ్లపై సింగరేణి సీఎండీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. నాయకులు కచ్చకాయల సదానందం, వడ్డేపల్లి దాస్, రవీందర్‌రెడ్డి, గడ్డం కృష్ణ, బేబి శ్రీనివాస్, మొగిలి, శ్రీనివాస్, తాటికొండ రాజయ్య పాల్గొన్నారు.

మొదలైన తునికాకు సేకరణ

(5వ పేజీ తరువాయి)

యూనిట్లు ఉండగా వాటిలో తునికాకు సేకరణ కోసం ప్రభుత్వం ద్వారా అటవీ శాఖ టెండర్లు ఆహ్వానించింది. ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, కల్వచర్ల కేవలం మూడు యూనిట్లనే కాంట్రాక్టర్లు తీసుకున్నారు. మిగితా 4 యూనిట్లలో ఆకు సేకరణకు కాంట్రాక్టర్లు టెండర్లు తీసుకోలేదు. జిల్లాలోని 7 యూనిట్లలో 47 ఆకుల కళ్లాలు, 7600 స్టాండర్ బ్యాగ్‌ల టార్గెట్ ఉండగా వాటిలో ఈ సంవత్సరం 3 యూనిట్లలో మాత్రమే టెండర్ ప్రక్రియ ముగిడంతో వాటి పరిధిలోని 18 కళ్లాల్లో 2800 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా ఆకు సేకరణ జరగతుంది. మిగితా 29 కళ్లాల్లో ఈయేడు ఆకు సేకరణ జరగడం లేదు. ముత్తారం యూనిట్ పరిధిలోని దర్యాపూర్, హరిపురం, కేశనపల్లి, మచ్చుపేట, ఖైదంబండ, పారుపల్లి గ్రామాల్లో 900 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా ఆకుల కళ్లాలు ఏర్పాటు చేశారు. ఖమ్మంపల్లి యూనిట్ పరిధిలోని చిన్నఓదాల, ధర్మారం, గోపాల్‌పూర్, జీల్లల్లపల్లి-ఏ, జిల్లల్లపల్లి-బీ, ఖమ్మంపల్లి-ఏ, ఖమ్మంపల్లి-బీ, సీతంపల్లి గ్రామాల్లో 1700 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా కళ్లాలు ఏర్పాటు చేశారు. కల్వచర్ల యూనిట్ పరిధిలోని గౌరెడ్డిపల్లి, రత్నాపూర్, సబితం, వెన్నంపల్లి గ్రామాల్లో 200 స్టాండర్ బ్యాగుల లక్ష్యంగా కళ్లాలు ఏర్పాటు చేశారు. 50 ఆకుల కట్టకు రూ. 3 కాంట్రాక్టర్లు కూలీలకు చెల్లిస్తున్నారు. వెయ్యి ఆకు కట్టలు ఒక స్టాండర్ బ్యాగ్‌గా లెక్కిస్తారు. 3 యూనిట్ల పరిధిలోని ఆయా అటవీ గ్రామాల్లో వారం లేదా 10 రోజుల పాటు తునికాకు సీజన్ సందడి కొనసాగనుంది.

దుర్గాదేవి అమ్మవారికి పుష్పార్చన


లక్ష మల్లెల పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు

గోదావరిఖని, మే 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బంగ్లాస్ ఏరియాలోని దుర్గాదేవి ఆలయంలో వైశాఖ శుద్ధ పౌర్ణమిని సందర్భంగా సోమవారం లక్ష మల్లెల పుష్పార్చన నిర్వహించారు. ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ ఆధ్వర్యంలో డైరెక్టర్(ఆపరేషన్స్) సతీమణి మాలతి సూర్యనారాయణ, డైరెక్టర్(పీపీ) సతీమణి విజయ వెంకటేశ్వర్లు, ఆర్జీ-1, 2, 3, అడ్రియాల జనరల్ మేనేజర్ల సతీమణులు, ఆలయ కమిటీ సభ్యులు, లేడిస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో లక్ష్మీ అష్టోత్తర సహస్రనామ పూజలు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. వివిధ ఏరియాల జనరల్ మేనేజర్లు లలిత్ కుమార్, బైద్య, వారి సతీమణులు ఉమా, సుధా, లలిత, సునీత, అలివేణి, కృష్ణ సోనాలి, నిర్మల పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికుల విధుల బహిష్కరణ

జ్యోతినగర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లోని కాంట్రాక్టు కార్మికులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. నెలకు రూ.1020 చొప్పున రావాల్సిన 16 నెలల ఏరియర్స్ చెల్లించాలని, 60 ఏళ్లు దాటాయనే కారణంతో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. 10వ తేదీ దాటినప్పటికీ కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. ఎన్టీపీసీ ఏజీఎం ఉమేష్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తానని చెప్పడంతో కార్మికులు నిరసన విరమించి విధుల్లోకి వెళ్లారు. కార్యక్రమంలో చిలుక శంకర్‌తోపాటు కార్మికులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు



సింగరేణి స్కూల్ సందర్శన

గోదావరిఖని, మే 12(ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులతో కలిసి ఆర్జీ-2 జీఎం వెంకటయ్య సోమవారం సెక్టార్-3 పాఠశాలను సందర్శించారు. ఉద్యోగ కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో సీబీఎస్ఈ సెలబస్‌ను ప్రారంభించడం సంతోషకరమైని యూనియన్ జనరల్ సెక్రెటరీ జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్ అన్నారు. పాఠశాల ఆధునీకరణ పనులను పరిశీలించారు. అడ్మిషన్లు, స్కూల్ బస్ టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని జీఎంను కోరారు. అధికారులు రాముడు, ఎర్రన్న, యూనియన్ ప్రతినిధులు వైవీ రావు, జీ రవీందర్, సాంబశివరావు, మహేందర్, రమేష్ ఉన్నారు.

డంప్‌మెన్, ట్రిప్‌మెన్ పోస్టులకు రాతపరీక్ష

గోదావరిఖని, మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో ఖాళీగా ఉన్న డంప్ మెన్, ట్రిప్‌మెన్ పోస్టులకు సోమవారం యాజమాన్యం అంతర్గత అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించింది. ఈపరీక్షకు అర్హులైన 108 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 102 అభ్యర్థులు హాజరయ్యారు. ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈ) మురళీకృష్ణ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

సమస్యల పరిష్కారానికి యాజమాన్యం హామీ

గోదావరిఖని, మే 12(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం హామీ ఇచ్చినట్టు ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్క సమ్మయ్య పేర్కొన్నారు. సోమవారం వీకేపీ గనిలో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సీఎండీ స్థాయి స్ట్రక్చర్ సమావేశంలో హైద్రాబాద్‌లో కార్మికుల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని కోరగా మూడు నెలల్లో ఏర్పాటు చేసేలా చూస్తామని సీఎండీ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్ చేయాలనే డిమాండ్‌తో పాటు కార్మికుల సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని కోరగా, విధివిధానాల రూపకల్పనకు వేర్వేరు కమిటీలను వేస్తామని సీఎండీ హామీ ఇచ్చినట్టు సమ్మయ్య పేర్కొన్నారు. 2018 నుండి ఇప్పటి వరకు అన్‌ఫిట్ అయిన ట్రేడ్స్ మెన్, మైనింగ్ స్టాఫ్‌లకు సూటబుల్ జాబ్ ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించినట్టు ఆయన తెలిపారు. కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఈనెల 20న జరగనున్న టోకెన్ సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈగేట్‌మీటింగ్‌లో బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, నాయకులు అన్నారావు, మహేందర్, సాంబశిరావు, రవికుమార్, సెగ్గెం శంకర్, విజయ్, భార్గవ్ పాల్గొన్నారు.